# సరిహద్దులు దొరకని సంధ్య

సముద్రం తనపని తను చూచుకుంటున్నది. సముద్రమేకాదు—జీవుల్లో పెక్కుభాగం తమపని తాము చూచుకుంటారు. ఆ మిగిలిన భాగం అయినా తమపని చూచుకుంటున్నట్లే భావిస్తారుగాని, నిజానికి యితరులని దుయ్యబట్టటమో, సానబట్టటమో చేస్తూంటారు—అక్కడికదే తమ పనన్నట్టు. కాని వాసుదేవరావుకు తన పనేమిటో తోచడంలేదు. అందులో-అతని బలహీనత ఏమీలేదు, అప్రయోజకత్వమూ యేమీలేదు.

తీరాన కూర్చున్నాడు, పడుతోలేస్తోన్న అలలని చూస్తో. ఎంత చిత్రంగా వున్నది! ప్రతి అలా లేవాల్సిందే-పడాల్సిందే! అదేరీతిగా, పుట్టిన ప్రతిప్రాణీ బతకాలి యీ ప్రపంచంలో, చావు రాసిపెట్టివున్న ఘడియ వొచ్చేంతవరకూ. ఈ బ్రదకటమైనా, ఎవడియిష్టమైనట్టు వాడు బతకటానికి లేదు. లోకాన్ని మెప్పించాలి, సంఘాన్ని వొప్పించాలి. అందరికీ-పోనీ తనకు సంబంధించిన అందరికీ-నచ్చేపనిగాని చెయ్యరాదు.

నవమాసాలుమోసి కంటుంది తల్లి. ఏమిసృష్టి? ఒక ప్రాణికి భూమిమీద అడుగిడటానికి యెంత యత్నపూర్వకమైన కార్యసాధన జరగాలి? తొమ్మిది నెలలూ అంతర్గతంగావుండి, బయలుపడ్డ క్షణంనించీ కామ, క్రోధ, మోహ లోభాది లక్షణాల నాస్వాదించుకుని, వొక యేటికొక యేడు వస్తున్నకొద్దీ ముచ్చటగా తయారౌతూ, చివరకు సాధించేదేమిటి....?

పుట్టిన ప్రతివాడికీ ఐశ్వర్యం అంటం దేనికి—తిన తిండీ, కట్ట బట్టా వుండవు. ఇవీ సంపాయించుకోలేని దుస్తర స్థితిలో వున్నారు మూడువంతుల జనం. న్యాయంగా వీటిని సంపాయించటానికి వొక్కొకవ్యక్తికి యెన్నో సంవత్సరాల కాలం పడుతుంది. నిజం! న్యాయం, అన్యాయం—ఈ రెంటికి మధ్య యెంత బలీయమైనగోడ సృజించబడ్డది! ఎవరూ ఆలోచించరుగాని,

జీవితం యెంతో నికృష్టమైనది. ఒక్కొకరి పాలిటి యమదేవత కన్నా కనా కష్టంగా కనిపించే యీ కాలానికి కొలబద్ద....?.......

పుట్టేసరికి వాసుదేవరావులో యేమి ప్రత్యేకత లేదు. నాలుగుచేతుల్తోను, రెండు మెడల్తోను పుట్టలే దతను. కాగా, నోట బంగరు చెంచాకూడా లేదు? తండ్రి గంగాధరరావు చిన్న గుమస్తానించీ చేసుకుంటూ వొచ్చి, వొక "నాన్ గెజిటెడ్ ఆఫీసరు"గా రిటైరైనాడు చివరికి. తండ్రితో కన్నా తల్లితో యెక్కువ చనువు వాసుదేవరావుకి, తండ్రి అతనికి చేరువలోలేకండా పోయినాడు. "ఆయనో వుద్యోగి, సామాన్యులకు దర్శనం యివ్వని దేవుఁడు-" అన్న దృష్టిలో చూస్తూవున్నది తన తల్లి సుందరమ్మగూడా! ఇతను పుట్టినపుడు గానీ, పెరుగుతూండగా గానీ ఆకాశవాణి పలుకరించ లేదు దేవతలు పూలవర్షం కురిపించలేదు..........సాధారణమైన తెలివితేటలు చూపుతూనే వాసుదేవరావు స్కూలుఫైనలు ప్యాసైనాడు. సుందరమ్మ యితన్ని లండను పంపి పి హెచ్ డీయో, బారిస్టరో చేయించాలని చూచిందిగాని, గంగాధరరావు యిందు కియ్యకొనలేదు. తనే వాతావరణంలో పెరిగాడో అదే వాతావరణంలో కొడుకును గూడా పెంచాలని ఆయన కొక సుముహూర్తాన తోచింది. తోచింతర్వాత ఆ ఆలోచన అమలుజరపటానికి జంకేందు కాయన వ్యవహారజ్ఞాన శూన్యుడుకాడు. సుందరమ్మ ఆయనతో వాదించి ఫలంలేకపోయింది.

"ఈ చిన్న వయసులో వాడేం చేయగలడు? ఇప్పటినించే వుద్యోగాలకు దేవుళ్ళాడాలా? కనీసం బి. యే, అయినా చదివించి...." అన్నదామె.

చాప్పాల్లే, నేనేం చదివాను? పన్నాలుగోయేటి నించీ సంపాదిస్తూనే వున్నాను, నా పోషణ నేను చేసుకుంటూనే వున్నాను — ఇవాళ్టి కింతవాడి నయ్యాను. దైవకృప వుండాలేగాని, చదువులూ, తెలువులూ మనుషుల్ని పోషించలేవు. కోర్టుపనే లేని ప్లీడర్లూ వున్నారు; కేసులే లేని

డాక్టర్లూ వున్నారు, వేలకువేలుపోసి చదవగానే అయిందీ? అదృష్ట మన్నేదానికి చదువు జతగాదు—' అన్నాడాయన. ఈ వేదాంతం సుందరమ్మ కర్థంగాలేదు. ఆవిడ అర్థమైనా కానట్టే భావించి వుండాలి! ఆవిడ వాదనల్లా యిది - వాడు కుర్రాడు, సుఖపడవలెననే మనం కోరుకోవాలి గాని... యే పెద్దచదువో చదివించి, సునాయాసంగా కుర్చీలో కూర్చుని సంతకంపెట్టి నెలకు అయిదారువందలు గడించే వుద్యోగమో సంపాదించి యిచ్చి, నేత్రానందంగా చూస్తూండాలి! వాడు గుమాస్తాగా యేం తేగలడు? దాంతో వాడి పొట్టనిండగా, మన పోషణ యెంతవరకు నడుస్తుంది? ...

గంగాధరరావుకు పిత్రార్జితం ఇసుక రేణువులుగూడా లేవు. అయితే వుద్యోగంలో ఆయన బాగానే ఆర్జించినాడు. అది అందరికీ కన్పించేలాగు భూ రూపేణాగాకుండా, రొక్కంగా బ్యాంకుల్లో వుంది. ఈ పరమ రహస్యం - అనదగ్గది! - సుందరమ్మకు తెలుసు. ఈ డబ్బులో కొంతయినా కుర్రవాడి వున్నతికి యెందుకు తోడవరాదు? అని ఆమె స్వంతగా — స్వగతంలో — ప్రశ్నించుకొన్నదేగాని, జవాబు శూన్యం.

సుందరమ్మ కినిసింది; పెద్దకొడుక్కు చదువు చెప్పించనందుకు. భర్త దాన్ని లెక్కపెట్టలేదు. అట్లా లెక్కపెట్టే స్థితిలోగూడా ఆయన లేడు. సుందరమ్మ అవమానింపబడ్డది. అయితే యీ అవమానం, భారం కేవలం ఆమె కొనితెచ్చుకున్నదే. తనకన్నా అన్నివిధాలా తెలిసినవాడూ, విద్యాధికుడూ అయిన భర్తయొక్క అభిప్రాయాలకు భిన్నంగా వర్తించేందుకు తనకెందుకు అభిలాష కలగాలి? ఆయన చెప్పిందానిలోనూ, యెంత పట్టువున్నదో మరి!

ఏమయినా సుందరమ్మ మనసు పూర్వపుటభిప్రాయాలవైపే మొగ్గుతున్నది. తనంత తాను రాజీకి రాక తప్పిందిగాదు కాని యిన్నాళ్ళూ ఆవిడ బోధలూ, వుపన్యాసాలూ విన్న వాసుదేవరావు అట్లా రాజీకి రావటానికి

అంగీకరించలేదు. బోధలవల్లనైతేనేం, స్వతహాగానైతేనేం, అతను వున్నత విద్యపై వాంఛ కన్పింపజేస్తున్నాడు.

ఈ కారణంగా గృహచ్ఛిద్రం యేర్పడ్డది. ఒకరకంగా దీనికంతకూ సుందరమ్మే కారణం! పోనీ - కొన్ని రకాలుగా ఆవిడ కొంతవరకు కారణం! దీన్ని "చేసుకున్న పాపం"గా అనుభవించక తప్పిందిగాదు.

వాసుదేవరావు తీవ్రంగా వాదించాడు. కఠినంగా మాట్లాడాడు. అంతకు తగ్గట్టుగా తండ్రీ జవాబు చెప్పాడు. ఇదంతా సుందరమ్మకు కర్ణ కఠోరంగా జరిగింది. గంగాధరరావు అనుకోని మాటలుగూడా కొడుకు అన సాహసించాడు. "నన్ను కన్నందుకు మీ బాధ్యతేమిటి?" అని అడిగాడూ అంటే నిజంగా - అదొక ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు! "నా బాధ్యత నేను తీర్చుకున్నాను. ప్రతికొడుకునీ వాడు కోరుకొన్నంత చదువూ చెప్పించి కొండమీది కోతినిగూడా కావాలన్నప్పుడు, తెచ్చి యివ్వాల్సిన బాధ్యత తండ్రికి వున్నదని నేను వొప్పుకోను-" అవును మరి! - ఆయన నలుగురు పిల్లల తండ్రి - "ఆ మాటకు మానాన్న నాకేం చదువుచెప్పించాడూ? సంపాయించుకోగల తాహతు కలిగేంతవరకూ చెప్పిస్తే చాలు-" అనీ అన్నాడు. "మానాన్న, మీనాన్నంత బీదవాడు గాదు-" అన్నాడు వాసుదేవరావు. గంగాధరరావు తండ్రి చాలాకష్టాలు భరించి, కుర్రాడికి చదువు చెప్పించిన మాట నిజమే. "కావొచ్చు -. కాని మీ తండ్రికి ప్రతివాడినీ ఐ. యె. యస్. ప్యాసు చేయించగల తాహతు లేదని నువు తెల్సుకోవాలి!"

ఏమయితేనేం. తండ్రి కొడుకుల మధ్య వ్యవహారం బెడిసింది.

-"నేనేం కలెక్టరు కావాలని కోరుకోటం లేదు. కలలోగూడా కనీసం! బి. ఏ. పట్టా తీసుకోవాలని, మహా వాంఛగా వుంది!"

"కలిగిన ప్రతి వాంఛనీ తీర్చుకోగల షావుకారులమైతే యిక లేందేముంది? సాధనోపాయాలు అందరికీ వుంటాయా?"

ఉంటాయంటాడు వాసుదేవరావు - అందరిసంగతీ గాదు, తనకు! తీవ్రతరమైన సమస్యలు యెదుర్కొన్నప్పుడు, సహజంగా బుర్ర వేడెక్కేట్టు ఆలోచిస్తాం. ఈ ఆలోచనావశ్యకత అఖ్కర్లేకుండానే యిద్దరూ నిశితాభిప్రాయాలు యేర్పరచుకొని వున్నారు మొదటినించీ. ఆ చిక్కేమీ లేకుండా పోయింది. "ఏమయినా, నాకింకా చదువుకోవాలని వుంది!" అన్నాడు వాసుదేవరావు. "అది నా శక్తికతీతం-" అన్నాడు తండ్రి. తల్లి ప్రమేయం యిపుడేమీ లేదు. తరువాత వాదనంతా వర్ణనాతీతంగా సాగింది. చివరకు గంగాధరరావుకు అమితమైన కోపం వచ్చింది. రాదూ మరి? కన్నవాడు - బాధ్యత తెలిసినవాడు - తను, తనకు పుట్టినవాడు తనమాట కాదని-"

"నా అభిప్రాయం నేను మార్చుకోను - మార్చుకోవలసిన అవసరం గూడా నాకు లేదు. నువు మరీ తెగించిపోయావు. తీరని విద్యాతృష్ణ నావల్ల తీరే అవకాశం లేదు. అది తీరేటందుకు నువు నా యింటినుంచి వెళ్ళిపోవటానికి నా అభ్యంతరం యేమీలేదు. నా మాట వినని కొడుకు నా యింట కాలు పెట్టటానికి అనర్హుడు. ఇందులో నా తప్పేముంది?" అన్నాడాయన.

ఈ మాట అనిపించుకున్నమీదట, వాసుదేవరావుకు వొక్కక్షణం కూడా యింటనుండ బుద్ధిగాలేదు. అతడి అభిమానం పూర్తిగా దెబ్బతిన్నది. ఎంచేతనో ఆ మనుషులను చూడ బుద్ధిగాలేదు. బయలుదేరాడు. శీఘ్రంగా నడవమన్నాడాయన. సుందరమ్మ కంట తడిపెట్టింది. కాళ్ళావేళ్ళాబడింది యిద్దరినీ శాంతించమని. కాని యిద్దరూ నృసింహస్వామి అవతారమే గావును? వాసుదేవరావు దురుసుగా బయల్దేరింతరవాత సుందరమ్మ భర్త చేత ఓదార్చబడ్డది. "ఎంతదూరం వెడతాడు? కూడు గుడ్డ లేక యెంత కాలం వుండగలడు? మళ్ళీ రాత్రికి తిరిగిరాకపోతే చూడు!" అన్నాడు. సుందరమ్మ దుఃఖం దిగమింగుకున్నది. కాని అతను రాత్రికి రాలేదు. మరసటి సాయంకాలం వరకూ అంతు చిక్కలేదు.

అతను ఋంటి గుమ్మం దిగిన వెంటనే ఆలోచించుకున్నాడు కర్తవ్యం, తను తండ్రితో పోట్లాడి వెళుతున్నాడు, ఎక్కడికి?

తను చేసినపని యెంతో తప్పయినట్లు బాధపడ్డాడు. విచారించాడు. అయినా పట్టుదల వదల్లేదు. ''గతంనాస్తి'' అనుకున్నాడు. భావినిగురించి ఆలోచించుకున్నాడు. విద్యాతృష్ణ తన కెంతవర కున్నదీ కొల్చుకున్నాడు. ఎంతో గొప్పగా లేదనుకున్నాడు. స్పష్టంగా—తండ్రితో పోట్లాడడం కేవలం విధిప్రేరేపణవల్లనే జరిగిందనుకున్నాడు. పోనీ అట్లా కనిపించకుండా చేయటానికి, యిక ముందు యే కాలేజీలోనోచేరి చదవటం దుర్లభం. దాని కెంతో డబ్బుకావాలి. ఆ డబ్బు తనకు వూర్కే యెవరిస్తారు? పైగా అనాధుడని అనిపించుకొనటం యెంత చిన్నతనం! అది పొసగని పని!!

ఒంటరిగావుండి తనేం చేయగలడు? పోనీ, ఓ గుమాస్తా వుద్యోగం దొరికినా బాగుండిపోను! అది దొరకటం దుర్లభం. అసలు అసాధ్యమే అని చెప్పొచ్చు? ఈ వూళ్ళోనే ప్రయత్నించటం శుద్ధ అవివేకం. పరాయి వూళ్ళొ తనకు పలికే దెవరు? గవర్నమెంటు ఆఫీసులు అంత ఖాళీగా యేడ్చినై గనక!

తిరిగి తండ్రిదగ్గరికిచేరి క్షమాపణ చెప్పుకోవటమే బుద్ధికి లక్షణంగా తోచింది. దానికి ధైర్యం చాలకండావుంది. ఇంతదూరం వొచ్చి, వెనుదియ్యటం యేమంత మంచిది?

ఇంటికి వెళ్ళాడు, తండ్రి లేడు. తల్లి తనదుఃఖం యావత్తూ వొలకబోసింది. తను యెప్పటికైనా తిరిగివస్తాడని ఆశించానన్నది. తన ఆశయం తీరినందుకు యెంతో సంతోషిస్తున్నానన్నది. వాసుదేవరావుకు నోటమాట రాలేదు. అతిఆత్రంగా అన్నం తిన్నాడు. మంచం వాల్చుకు కూర్చున్నాడు. పూర్తిగా రెండురోజులన్నా గాలేదు తనీయింట్లోంచి వెళ్ళిపోయి! అంత మాత్రానికే తనకూ ఆ యింట్లోవాళ్ళకు యెంత దిగులూ, బెంగా పట్టు

కున్నది! నిజంగా యిదొక యుగప్రాయంగా గడిచివుండాలి. ఈ వూహ ల్లోనూ, తల్లి కుశల ప్రశ్నల్లోనూ అతను తండ్రిని గురించి ఆలోచించనే లేదు. ఆయన మామూలు టైముకే వచ్చాడు. కొడుకు రావటం గమనిం చాడు, కాని పలకరించలేదు. సుందరమ్మ మళ్ళీ తన అదృష్టాన్నంతా వెళ్ల బోసుకున్నది. చివరకు గంగాధరరావే అన్నాడు—'ఏం బెదిరించిపోతివిగా. మళ్ళీవచ్చావేం? ఒక్కరోజులో కళలన్నీ దిగజారిపోయినయా?'

వాసుదేవరావు ఆసలాదృశ్యంలో హతాశుడయ్యే కూర్చున్నాడు. తండ్రిమాటలు చల్లబడ్డ పౌరుషాగ్నిని మళ్ళీ రగుల్కొల్పినట్లయింది. ఏమీ మాటాళ్ళేదు. "బెదిరింపులు పనిచెయ్యవు. మంత్రాలకు చింతకాయలు రాలుతాయనుకున్నావు గాబోలు! నా అంత పట్టుదలమనిషి వుండబోడు?" అన్నాడు తండ్రి స్వోత్కర్షణ ధోరణిలో, అయింది! వాసుదేవరావు అడకువ పూర్తిగా దెబ్బతింది. తండ్రి ధోరణి తనని వోదారుస్తున్నట్లుగా వుండేందుకు మారుగా, గిల్లి కజ్జాపెట్టుకున్నట్లుగావుంది. తను మనసారా పశ్చాత్తాప పడే యిక్కడికి వచ్చాడు. తండ్రి యీ లక్షణాన్ని గమనించకుండా, పూర్వ పుమాటల్నే వల్లెవేయటం వల్ల పూడ్చినగొయ్యి తిరగదోడినట్లయింది. ఈసారి అతనికి పూర్వంకంటే నూరురెట్లు సాహసం వచ్చింది.

చివాలున మంచంమీదినుంచి లేచి నించున్నాడు. "నా భావాలు తప్పని గ్రహించాను. పశ్చాత్తాపం తెలుపటానికి వచ్చాను. ఈ లోపలే నా అంతఃకరణాన్ని రెచ్చగొట్టారు. వెళ్ళిపోతున్నాను. మళ్ళీరాను. సెలవు—" అని బయల్దేరాడు. తల్లి ఆపింది. తండ్రిమాత్రం లెక్కచెయ్యలేదు. "ఇదివరకూ యింతకు తక్కువ మాటలన్నావా! మళ్ళీ రేపువస్తావు. కాకపోతే యెల్లుండి-ఫో; యీ బెదిరింపులకు జడవను!'' అన్నాడు.

వాసుదేవరావు వెళ్ళిపోయినాడు సుందరమ్మ యే ఆధారం చూచు కునో మరి, ''మళ్ళీవాడు రాడు''—అన్నది. గంగాధరరావు ఆజోలి యెత్తుకోలేదు.........

వాసుదేవరావు శాంతంగా సముద్రతీరాన కూర్చుని ఆలోచించుకున్నాడు. యేంచెయ్యాలి? ఇదివరలో అతను యింటినించి వెళ్ళిపోయినాడు. ఇపు డట్లాగాదు. తను యింట్లోనించి వెళ్ళగొట్టబడ్డాడు. ఈసారి యెంత ప్రయత్నించినా మళ్ళీ యింటికి వెళ్ళలేడు. వెళ్ళినా వాళ్ళు రానియ్యరు. అట్లాంటి ఘడియనే అసలు బ్రహ్మ సృష్టించలేదు?.... ....

అలలు వాసుదేవరావుమీదికి రావటంలేదు. కాని వాటిప్రభావంవల్ల "తడి" అయిన గాలిమాత్రం విసురుగా తగిలి అతన్ని కలవర పరుస్తూనే వుంది. ఆలోచన తెగకముందే సంధ్యాసమయం ముగిసింది. *

(సుభాషిణి)